

మహిళా సంఘాలకు తీపి కబురు



- వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు కసరత్తు
- డీఆర్డీఏ, మెప్మా శాఖల నుంచి ప్రభుత్వానికి నివేదికలు
- జిల్లాలో 1,02,161 మందికి ప్రయోజనం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి సంస్థల అధికారులు, మున్సిపాలిటీల పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) డీఎంసీలు సర్కారుకు పూర్తిస్థాయి నివేదికలు అందజేస్తున్నారు. 2005 సంవత్సరం నుంచి మహిళా సంఘాలకు పావలా వడ్డీకి రుణ పథకం అమల్లోకి వచ్చింది. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకునే సభ్యులకు ఇది వర్తింప జేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2016 వరకు ఈ విధానం కొనసాగింది. 2017 తర్వాత పావలా వడ్డీ డబ్బులు వారి ఖాతాల్లో వేయడం నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించేందుకు కసరత్తు చేస్తుండడంతో మహిళా సంఘాలకు లబ్ధి చేకూరనుంది.

● జిల్లా వ్యాప్తంగా..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, రెండు మున్సిపాలిటీలలో 9,047 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 1,02,161 మంది సభ్యులున్నారు. ప్రభుత్వం వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంతో మహిళలు ఆశించిన స్థాయిలో లబ్ధి పొందే వీలుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందిరి మహిళా శక్తి పథకం ద్వారా ఇప్పటికే సౌర విద్యుత్ యూనిట్లు, ఆర్టీసీ బస్సులు, ఇటుకల తయారీ తదితర పథకాలను వర్తింపజేశారు. రానున్న రోజుల్లో వడ్డీ లేని రుణాలు రూ. 50 వేల నుంచి రూ. కోటి వరకు ఇచ్చి స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేలా ప్రొత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.

● మహిళలు ఆర్థికంగా బలపడేలా..

మహిళలు ఆర్థికంగా బలపేడేలా చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. అర్హులైన సంఘాలకు బ్యాంకు రుణాలు, కొత్త వ్యాపారాల ఏర్పాటుకు ఆర్థిక సాయం, క్యాంటీన్ల ఏర్పాటు వంటివి చేస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతోంది. ప్రభుత్వపరంగా అతి వలకు చేస్తున్న కార్యక్రమాలపై ప్రచారం కల్పించేం దుకు ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహిస్తోం ది. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు గ్రామ, మండల, పట్టణ సమాఖ్య సమావేశాలను ఏర్పాటు చేసి సంబరాలు నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు సంఘాల సభ్యుల వివరాలు సేకరించడంతో పాటు అర్హులైన వారికి వడ్డీలేని రుణాలు ఇవ్వడానికి ప్రణాళికతో సాగుతున్నారు.

5,037 గ్రూపులకు రుణాలు మంజూరు..

- దత్తారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో 9,047 గ్రూపులకు గాను 5,037 గ్రూపుల కు వడ్డీలేని రుణాలు మంజూరయ్యాయి. డీఆర్డీఏ పరి ధిలో 7,947, మెప్మా పరిధిలో 1,100 గ్రూపులు న్నాయి. ప్రస్తుతం 5,037 మందికి రూ. 5.65 కోట్లు మం జూరయ్యాయి. మిగిలిన వారికి విడతల వారీగా మం జూరు లభించనుంది. గ్రామీణ ప్రాంత మహి ళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి ద్వారా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.

వైభవంగా మహంకాళి బోనాల జాతర



బోనాల సందర్భంగా నృత్యం చేస్తున్న శివసత్తులు

కాగజ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం మహంకాళి బోనాల జాతర వైభవంగా నిర్వహిస్తారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బోనాలను ఎత్తుకొని మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవుడమ్మ స్వరూప ఆధ్వర్యంలో శివసత్తులు బోనాలతో నృత్యాలు చేశారు. ఉదయం మహంకాళి ఆలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, మాజీ జడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, టీడీపీ ఉమ్మడి పార్లమెంటు జిల్లా కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్, బోనాల కమిటి అధ్యక్షుడు తుమ్మ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ సీఐ ప్రేం సాగర్ ఆధ్వర్యంలో ఎస్సైలు గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు వీరభద్రచారి, భాస్కర్ రెడ్డి, గజ్జల లక్ష్మణ్, సంజయ్ సింగ్, కలికోట రమణయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో వనమహోత్సవం

సిర్పూర్(టి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టు ఆషాడంను పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గంగు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్లలో, ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటి సంరక్షించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

కాగజ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను ఆదివారం బాల్యమిత్రులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమతో చదువుకున్న మిత్రుడు కమిషనర్ కావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పట్టణంలో సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ నియోజక వర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన బాధితులకు స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఆసుపత్రి పాలైన బాధితులకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు. నియోజక వర్గ ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటానని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్‌లను మండలంలోని వివిధ గ్రామాలకు మండల అధ్యక్షుడు పుల్ల ఆశోక్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడుదలైన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, మొండి, రావుల నరేష్, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట్నాక విజయ్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానని అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కోట్నాక విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎన్నికలకు పరిశీలకునిగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ పరధాన కార్యదర్శి సారంగపాణి, ఎన్నికల అధికారిగా వెంకటేశ్వరరెడ్డి, బండ మీనారెడ్డి వ్యవహరించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కోట్నాక విజయ్, చీఫ్ పాట్రన్‌గా సట్ల శంకర్, ఉపాధ్యక్షులుగా పుర్క ఉద్దవ్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, లక్ష్మి, సుభాష్, కార్యదర్శిగా గుండా లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీగా స్వప్న, ప్రవీణ్, హరికృష్ణ, తులసీదాస్, రవీందర్, కోశాధికారిగా మంగపతి, ఈసీ మెంబర్‌గా జంగు, సాయిబాబా, యాదగిరి, బారిక్‌రావు, విజయలక్ష్మి, చిన్నక్కలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు కోట్నాక విజయ్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం, క్రీడాకారుల సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా రెండో సారి అవకాశం ఇవ్వడం మరింత బాధ్యతలు పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, ఆదిలాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియే షన్ సెక్రెటరీ రాజేష్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియే షన్ కాంపిటేషన్ సెక్రెటరీ వాసుదేవరావు, జనగాం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖరరెడ్డి, క్రీడా కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, రవి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ



ఏకరూప దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ తిరుపతి రెడ్డి, కిరణ్, సునీల్‌రెడ్డి, వసతి గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వర గుహల్లో పూజలు

బెజ్జూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని పచ్చని అడవుల మధ్య నెలకొన్న సిద్దేశ్వర గుహల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెజ్జూరు, నాగులవాయి తదితర గ్రామాల భక్తులు శనివారం సిద్దేశ్వర గుహల్లోని సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి అక్కడే బస చేశారు. రాత్రంతా భజన పాటలతో గడిపారు. ఆదివారం అక్కడే వనభోజనాలు చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అందవెల్లి పెద్దవాగులో రెండు రోజుల క్రితం గల్లంతైన ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికుడు పోచయ్య(48) మృతదేహం కోత్మీర్ సమీపంలో ఆదివారం లభ్యమైంది. వాగులో పోచయ్య ఆచూకీ కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు, గజ ఈతగాళ్లు రెండు రోజులుగా గాలిస్తున్నారు. ఆదివారం ఉదయం కోత్మీర్ వాగు ఒడ్డున మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవో 49ని ఉపసంహరించుకోవాలి



కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకుడు ఆనంద్‌కుమార్

సిర్పూర్(టి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబరు 49ను ఉపసంహరించుకోవాలని సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని కోలాంగూడలో ఆదివారం జీవో కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49ని వెంటనే రద్దు చేయాలని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ముంజం ఆనంద్ మాట్లాడుతూ జీవో49తో గిరిజనులకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కాగజ్‌నగర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్/సిర్పూర్(టి),,జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బాలభారతి పాఠశాలలో 1998లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి సంగతులు నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయును ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా సామూహిక భోజనాలు చేశారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదవిని పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడిని పూర్వ విద్యార్థులు సన్మానించారు.

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని జిల్లా ఎ స్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికం గా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత కొద్ది సంవత్సరాల నుంచి నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ పలు కేసుల్లో నిందితుడి ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గోరంట్ల సురేష్‌బాబుపై పీడీ యాక్టు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే, సామాజిక స్థిరతను దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిని గుర్తించి అవసరమైతే పీడీ యాక్టు (పీవెంటీవ్ డిటెన్షన్ యాక్ట్) కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని తెలిపారు. నేరాలకు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఉపాధి కూలీలకు బీమా భరోసా

- ప్రీమియం చెల్లింపునకు 31వ తేదీ తుది గడువు



బెజ్జూరులో ఉపాధి పని చేస్తున్న కూలీలు(ఫైల్)

బెజ్జూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వలసల నివారణకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఎంతో మందిని ఆదుకుంటుంది. వారంతా నిరుపేదలే. కూలీలు పనులు చేసే చోట ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఆదుకునేలా బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరితే బాధితులకు పరిహారం అందించనున్నారు. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. దీని అమలుతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన 2.50లక్షల మంది కూలీలకు భరోసా దక్కనుంది. ఈ పథకంలో చేరిన వారు మరణించినా, ప్రమాదంలో పూర్తిగా అంగవైకల్యం కలిగినా రూ2లక్షల పరిహారం చెల్లిస్తారు. ఒకవేళ పాక్షిక అంగవైకల్యమైతే రూ.లక్ష పరిహారం అందిస్తారు. ఉపాధి కూలీలంతా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరేందుకు గడువు విధించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఫారాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది నమోదుకు శ్రీకారం చుట్టారు. ఏపీవోలు, టీఏలు, క్షేత్రసహాయకులు పేర్లు నమోదు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక, కూలీలతో అనుమతి ఇస్తూ బ్యాంకు ప్రతినిధులకు లేఖలు అందజేయనున్నారు. ఈ నెల 31వరకు గడువు విధించారు. ఈ పథకం కింద నమోదుకు 18 నుంచి 70ఏళ్లలోపు వారు అర్హులు. బ్యాంకు ఖాతా ఉన్నచోట కూలీలు తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరి. బీమా పథకంలో పేరు నమోదు చేయించాక, ఏటా తమ ఖాతా నుంచి రూ.20బీమాకు జమ చేయాలని రాత పూర్వకంగా లేఖ ఇవ్వడం తప్పనిసరి. ఇది ఇస్తేనే అమల్లోకి వస్తుంది.

చెల్లింపుల్లో సమస్య..

కానీ కూలీలకు బీమా ప్రీమియం చెల్లంపు సమస్యగా మారింది. వారు కచ్చితంగా బ్యాంకుకు వెళ్లి నమోదు చేసుకోవల్సి ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు దూరంగా ఉండడంతో ఇబ్బందులు ఎదరవుతున్నాయి. చాలా మంది కూలీలు తమ వేతనాలను సీఎస్పీ కేంద్రాలు, నగదు రహిత లావాదేవీల ద్వారా తీసుకుంటున్నారు. దూర ప్రాంతాల్లోని బ్యాంకుకు వెళ్లడం కష్టంగా ఉండడంతో లక్ష్య సాధనపై ప్రభావం చూపనుం ది. దీంతో జాబీకార్డు కలిగిన ప్రతి ఒక్కరూ బీమా ప్రీమియం నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోకున్నారు.

నడకే.. నరకం

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- వర్షాలకు బురదమయం
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బురదమయంగా మారిన రాజీవ్‌నగర్ రోడ్డు

వాంకిడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లు వర్షాలకు బురదమయంగా మారడంతో ప్రజలు నడిచేందుకు నైతం అవస్థలు పడుతున్నారు. బంబార గ్రామ పంచాతీలోని రాజీ వ్‌నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ గ్రామ ప్రజలకు నడకన రకంగా తయారవుతుంది. రోడ్డుపై గుంతలు ఏర్పడి మొకాల లోతువరకు బురద కావ డంతో కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి తయారైంది. నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు నిత్యా వసర ఇతర పనులకు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా తయారు కావడంతో కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అత్యవసర సమయంలో వైద్యశాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. రాజీవ్‌నగర్‌కు రోడ్డునిర్మించాలని పలుమార్లు పాలకులకు, అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోతుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏళ్లుగా ప్రజలకు అవస్థలు..

- ఎలగతి సుచిత్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి



మండలంలోని రాజీవ్‌నగర్, తేజిగుడ, ఖిరిడి తదితర గ్రామా లకు ఏళ్ల తరబ డి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు రోడ్లు బురదమయమై ప్రజలు నడవలేదని పరిస్థితి ఉంటుంది. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితులు ఉంటుంది. రాజీవ్‌నగర్ తో పాటు అవసరం ఉన్న గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

అప్పు పుట్టదు.. పథకాలు అందవు

- ఏజెన్సీలో రైతుల దుస్థితి
- పట్టించుకోని పాలకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనేతర రైతులు(ఫైల్)

జైనూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా ప్రభుత్వ పరంపోగు, ఖైసూరా భూములను సాగు చేస్తున్న గిరిజేనతర దళిత రైతులు అప్పులకోసం ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారుపాస్ పుస్తకాలు ఉన్న రైతులకు రైతు భరోసా డబ్బులను బ్యాంకు ఖాతాలో జమచేస్తోంది. కానీ గిరిజనేతర రైతులు మాత్రం వానాకాలం పంట సాగుకోసం వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి పహాణీలు అందించింది. బ్యాంక్ రుణాలు కూడా పొందేవారు. ప్రత్యేక రాష్ట్రంలో పహాణీలు ఇవ్వడం నిలిపివేయడంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. 2018- 2019లో అప్పటి జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ సమస్యలను గుర్తించి బ్యాంక్ నుంచి పంటరుణాలు పొందేందుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి భూములు సాగు చేస్తున్నట్లు పత్రాలు ఇప్పించి పంట రుణాలు ఇప్పించారు. ఆ తర్వాత వాటి జాడే లేదు. బ్యాంకు నుంచి పంట రుణాలు పొందిన ఎస్సీ(గిరిజనేతర)రైతులు పంటల రుణమాఫీకి సైతం దూరంగా ఉండి పోయారు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఎన్నికలప్రచారంలో భాగంగా ఉట్నూరులో గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములకు పంట రుణాలు తీసుకునేందుకు పహాణీలు ఇప్పిస్తానని చెప్పినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. రుణ మాఫీ వస్తుందనే ఆశతో బ్యాంకురుణాలు చెల్లించక పోవడంతో వడ్డీభారం సైతం వారిపై పడింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 12,864 మంది గిరిజనేతర రైతులు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజేతర రైతులకు రుణాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

విత్తనాల కొనుగోలుకు అవస్థలు..



వానాకాలం సీజన్‌లో విత్తనాల కొనుగోలుకు సైతం అవస్థలు పడుతున్నాం. ఐదేకరాల భూమిలో పంట సాగుకోసం వడ్డీ వ్యాపారులు చుట్టు తిరుగుతున్నా. వారు పట్టించుకోవ డం లేదు. ఉపాధిహామీ కూలీ పనులు చేసిన డబ్బులతో విత్తనాలు కొనుగోలు చేశాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలి.

- కాంబ్లే బాబా సాహెబ్, కొండిబాగూడ

రుణాల కోసం తిరుగుతున్నాం..



జైనూర్ మండలంలోని పవర్‌గూడ శివారులో సాగు భూమి ఉంది. పంట సాగుకోసం రుణాలకోసం తిరుగు తున్నా. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పహాణీతో బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేదు. ప్రస్తుతం బ్యాంకు నుం చి రుణం పొందే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

- పాలే ఉద్దవ్, జైనూర్

నానో ఎరువులతో ప్రయోజనం

- భూసారం దెబ్బతినకుండా సమగ్ర కార్యాచరణ
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు




బెజ్జూరులో నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు, నానో యూరియా సీసాలు

బెజ్జూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని సులభతరంగా, లాభసాటిగా మార్చడానికి నూతన ఆవిష్కరణలు ఊతమిస్తున్నాయి. ఈ కోవలో రూపుదిద్దుకొన్న నానోసాంకేతికత ఎరువుల తయారీలో సరికొత్త విప్లవానికి నాంది పలికింది. యూరియా, డీఏపీలు 'నానో ఎరువులు'గా ద్రవరూపంలో అందుబాటులోకి వచ్చాయి. పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని దశలవారీగా తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. భూసార దెబ్బతినకుండా వాతావరణ కాలుష్యం లేకుండా ఉండేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతోంది. చిన్న గుళికల రూపంలో ఉండే యూరియా స్థానంలో ద్రవరూపం నానో యూరియాను అందుబాటులో తెచ్చింది. డీఏపీ కూడా ఇలాగే లభిస్తోంది. దశాబ్దాలుగా సంప్రదాయ పద్ధతిలోనే బస్తాల కొద్ది ఉపయోగించిన రైతన్నలు నానో యూరియాపై ఆసక్తి కనబర్చడం లేదని వ్యవసాయాధికారుల సర్వేలో తేలింది. దీంతో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులతో రైతు వేదికల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

స్ఫటిక రూపంలో..

స్ఫటిక రూపంలో ఎరువులతో వృధా ఎక్కువ అవుతుంది. మార్కెట్‌లో 45కిలోల బస్తా రూ.270 ఉంది. దానికి సమానమైన నానో యూరియా అర లీటరు డబ్బా ధర రూ.225 మాత్రమే. మొక్కలకు పిచికారి చేయడంతో ఎక్కువ ఫలితం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పంట కాలానికి ముందుగానే రైతు భరోసా నిదులు జమ చేయడంతో రైతులు ఉత్సాహంగా సాగుబడి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎకరాలు కాగా ఇందులో వరి 50వేలు, పత్తి 3.40 లక్షలు, మిగిలిన పంటలను 18 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నెలాఖరు వరకు పత్తి పంట సాగు మొత్తం పూర్తికానుంది వరి 40 శాతమే పూర్తి చేశారు. బోరు బావుల వద్ద సాగు ఊపందుకోగా కాలువల వద్ద వరినాటు వేసే దశకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

- నాగరాజు, వ్యవసాయాధికారి, బెజ్జూరు



గుళికల రూపంలో కాకుండా ద్రవరూపంలో ఉండే అత్యాధునిక నానోయూరియా, డీఏపీ ఎరువులను ఉప యోగించడం వల్ల రైతులు లాభసాటి వ్యవసాయం చేసుకోవచ్చు. వీటి వినియోగంతో పోషకాల వినియోగ సామర్థ్యంతో పాటు పంటోత్పత్తుల దిగుబడి పెరుగు తుంది. పర్యావరణానికి సురక్షితమైంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాండూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన కొండు సాగర్ (22) అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ నాలుగు రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి



మృతి చెందిన శంకర్, సాగర్(ఫైల్)

లక్షెట్టిపేట, జులై 13 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలంలోని అంకత్‌పల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దేవాపూర్ సిమెంట్ ఫ్యాకరీలో పనిచేస్తున్న సిడాం శంకర్(37) తన భార్య ఇద్దరు కొడుకులతో కలిసి దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి నలుగురు ద్విచక్ర వాహనంపై దేవాపూర్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో మండలంలోని అంకత్‌పల్లి గ్రామ స్టేజీ సమీపంలో మంచిర్యాల వైపు నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే శంకర్ పెద్ద కుమారుడు సిడాం సాగర్(12) మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ పరిస్థితి కూడా విషమించి అర్ధరాత్రి మృతి చెందాడు. శంకర్ భార్య సుమిత్ర, చిన్న కొడుకు సంతోష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శంకర్ తమ్ముడు సిడాం జాకు ఫిర్యాదు మేరకు లక్షెట్టిపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవాపూర్‌లో విషాదం

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): ఇటిక్యాల సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవాపూర్‌కు చెందిన తండ్రికొడుకులు సిడం శంకర్(37), సిడాం సాగర్(12) మృతి చెందిన ఘటన దేవాపూర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి స్వగ్రామం దండేపల్లి మండలం వందూర్‌గూడకు వెళ్లి తండ్రిని పలకరించి శనివారం సాయంత్రం దేవాపూర్‌కు కుటుంబ సభ్యులతో బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు ప్రాణాలు విడిచారు. శంకర్ దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో లోడింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. దేవాపూర్ మేజర్ గ్రామ పంచాయతీలో 11వ వార్డు మెంబర్. తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆదివాసీ హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. శంకర్ మృతి పట్ల బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆదివాసీ సంఘాలు సంతాపం ప్రకటించి ఘనంగా నివాళులు అర్పించారు.

అటవీ అధికారుల వేధింపుల నుంచి కాపాడండి



పురుగుల మందు డబ్బాలు, పట్టా పుస్తకాలతో రైతులు

బెల్లంపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కార్యాలయం ఎదుట నెన్నెల మండలానికి చెందిన రైతులు పెట్రోల్, పురుగుల మందు డబ్బాలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం కలకలం రేపింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం నెన్నెల మండలానికి చెందిన కాసిపాక రాజంతో పాటు మరో 15 మంది రైతులు సర్వే నెంబర్ 671,672 పట్టా భూముల్లో 25 ఏళ్లకుపైగా 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా పత్తి పంటను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం అటవీశాఖ అధికారులు పంటను ధ్వంసం చేశారు. తమ వ్యవసాయభూముల్లో వ్యవసా య మోటార్లతో పాటు పైపులను సైతం అధికారులు తీసుకెళ్లారు. ఈ విషయం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లేందుకు వస్తే పోలీసులు, కాంగ్రెస్ నాయకులు రైతులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యేను కలవనీయకుండా అడ్డుకోవడంతో బాధిత రైతులు మనస్థాపానికి గురై రాజం అనే రైతు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేశ్, పోలీసులు అప్రమత్తమై వారి వద్ద నుంచి పెట్రోల్ డబ్బాతో పాటు పురుగుల మందు డబ్బాలను లాక్కున్నారు. దీంతో పోలీసులు, రైతులకు మధ్య వాగ్వాదం ముదిరి తోపులాటకు దారి తీసింది. ఈక్రమంలో క్యాంప్ కార్యాలయం ఎదుట ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వెంటనే క్యాంప్ కార్యాలయంలో ఉన్న గడ్డం వినోద్ ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో ఫోన్ చేసి మాట్లాడారు. రైతుల పట్టాభూముల విషయంపై న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి వెనుదిరిగారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పీర్దండిలో బోనాలతో తరలివస్తున్న మహిళలు

రెబ్బెన, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెబ్బెన, కౌటాల, ఆసిఫాబాద్ మండలాల్లో ఆదివారం భక్తులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. రెబ్బెన మండలం వంకులం గ్రామ మహిళలు పెద్దవాగు గాంధరి మైసమ్మ ఆలయంలో ఆదివారం పోశమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే కోవ లక్ష్మి బోనమెత్తి తల్లికి మొక్కులు తీర్చుకుంది. ఈ సందర్భంగా పూజకార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెబ్బెన సింగిల్ విండో చైర్మన్ సంజీవ్, వైస్ చైర్మన్ రంగు మహేష్, తిరుపతి, ఒమాజీ, నాగయ్య, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు రవీందర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తి పెట్టుకుని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి వచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు బాగా పండాలని, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేణుక, తదితరులు పాల్గొన్నారు .



బోనమెత్తుకొని వస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజంపేట కాలనీకి చెందిన ప్రజలు ఆషాడమాసాన్ని పురస్కరించుకొని పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. ఏటా కాలనీ నుంచి అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లించుకుంటామని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

వాంకిడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం రాత్రి పట్టుకున్నామని ఎస్సై ప్రశాంత్ తెలిపారు. రాత్రి పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి కారులో ఆసిఫాబాద్ వైపు అనుమానాస్పదంగా వెళ్తుండగా వాంకిడి ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద కారును ఆపి తనిఖీ చేశామని అన్నారు. వాహనంలో మహారాష్ట్ర మద్యం లభ్యమైంది. రాయల్ స్టాక్ ఫుల్ బాటిళ్లు 72, ఓసీ 90 ఎంఎల్ 2000 బాటిళ్లు పట్టుకున్నట్లున్న తెలిపారు. దాని వలువ సుమారు రూ. లక్ష 4 వేలు ఉంటుందని తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని మహారాష్ట్ర గఢ్చందూర్‌కు చెందిన సుదర్శన్, రాజేంద్ర పాపయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మంత్రికి సన్మానం

ఆసిఫాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భూగర్భ గనుల కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ ఆసిఫా బాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ మర్యాదపూర్వ కంగా కలిసి సన్మానించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న క్రమంలో ఆసిఫాబాద్ పట్టణ శివారులో మార్గ మధ్యలో కలసి సన్మానించారు. సందర్భంగా నియోజక వర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నిజాం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణికి నష్టం



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి సంస్థకు తీరని నష్టం జరిగిందని, విచ్చలవిడిగా డీఎంఎఫ్‌టీ నిధులు సిరిసిల్ల, సిద్దిపేటకు తరలించుక వెళ్లారని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో నూతన గనుల రావాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పారు. గత పాలకులు బొగ్గు గనుల వద్దని టెండర్లలో పాల్గొనవద్దని చెప్పి సింగరేణి నిధుల నిధిని కూడ దారి మళ్లించారని ఆరోపించారు. తాను కార్మిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సింగరేణికి సంబంధించిన డీఎంఎఫ్‌టీ నిధులు కోల్‌బెల్ట్ పరిసర ప్రాంతాలకే పరిమితం చేయాలనే ప్రతిపాదనలు పెట్టబోతున్నా నని తెలిపారు. అంతేఆకుండా సింగరేణిలో బావితరాల ఉపాధి అవకాశాల కోసం సింగరేణి డైరెక్టర్లతో సమావేశం పెట్టాలని ముఖ్య మంత్రికి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెరుగైన లాభాల వాటాను ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పాశమైలారం ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో 40కి పైగా కార్మికులు మృతి చెందడం చాలా మంది గాయపడిన సంఘటన దురదృష్టకరమని చెప్పారు. హైదరాబాద్‌లోని ఫ్యాక్టరీలో పని చేస్తున్నటువంటి కార్మికుల రక్షణకు ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని కూడ నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అసంఘటిత కార్మికులకు మినిమం వేజెస్ ఉండాలనే తన డిమాండ్ అని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ ప్రజల సంక్షేమ పథకాలను అందివ్వడంలో ముందున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన



యూనియన్‌లో చేరిన నాయకులు

శ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధించుకుంటామని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు భూపతి యాదగిరి అన్నారు. జీఎల్ఎస్ఆర్, కృష్ణకాలనీ, సివిక్ విభాగాలకు చెందిన కార్మికులు యూనియన్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్ల క్రితం కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితులను అధ్యయనం చేసి ఎస్‌సీసీడబ్ల్యూయూ సంఘాన్ని ప్రారంభించి సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులను ఐక్యం చేశామన్నారు. పెద్ద ఎత్తున పోరాటాలు చేసి జీఓ ప్రకారం బ్యాంకు ద్వారా వేతనాలు, పనిభద్రత, సీఎంపీఎఫ్, హాస్పిటల్ సౌకర్యం, డ్రెస్, ఐడీ కార్డు, బీమా, బోనస్, లాభాల వాటా, తదితర హక్కులు సాధించినట్లు చెప్పారు. అయినా ఇంకా చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. క్వార్టర్స్ కేటాయింపు, పెట్రోల్ అలవెన్స్ అందజేత, సమానపనికి సమాన వేతనం, తదితర సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేయాల్సి ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గొట్టి శ్రీనివాస్, శోభ, డివిజన్ నాయకులు బాపు, రమ, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ బోర్డు నిర్వహణకు మోక్షమెప్పుడు?

మందమర్రిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మెడికల్‌బోర్డు నిర్వహణ లేక నాలుగు నెలలకుపైగా కావస్తోంది. దీంతో అనారోగ్యంతో పాటు వివిధ వ్యాధులతో బాధపడుతూ మెడికల్‌బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఎప్పుడు నిర్వహిస్తారని వేచి చూస్తున్నారు. గతంలో కొందరు దళారులు మెడికల్‌బోర్డు పేరిట ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో గత నాలుగు నెలలుగా మెడికల్‌బోర్డు నిలిచిపోయింది. దీంతో గతంలో మెడికల్‌బోర్డు దరఖాస్తు చేసుకున్నవారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకునేందుకుంగా సిద్ధంగా ఉన్నవారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మెడికల్‌బోర్డు ఏర్పాటు ఎప్పుడు జరుగుతుందోనని మదనపడుతున్నారు. ఎవరో చేసిన తప్పులకు తమను బలిచేయడం ఏంటని పలువురు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం 58 సంవత్సరాలు నిండిన ఉద్యోగులు మెడికల్‌బోర్డుకు దరఖాస్తులు చేసుకొని వారి పిల్లలకు ఉద్యోగాలు పెట్టించేందుకు నానా తంటాలు పడుతున్నారు. సింగరేణిలో ఎప్పటి నుంచో మెడికల్ దందా జరుగుతుంటే విజిలెన్స్ విభాగం ఏం చేస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణకు కొంగుబంగారమైన సింగరేణిలో ఇప్పటికే ఉద్యోగులు అటు వృత్తిపరంగా నానా ఇబ్బందులు పడుతూ సమస్యల వలయంలో చిక్కుకొని వాటి పరిష్కారానికి మార్గాలు వెతుకుతుండగా మెడికల్‌బోర్డు నిర్వహించపోవడం నె త్తిమీద కుంపటిగా మారిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఏదేమైన పుండు ఒకాడా ఉంటే మందు ఓకాడ పెట్టడంఏంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణిలో ఇంత జరుగుతున్న మెడికల్‌బోర్డు నిలిచిపోయి న గెలిచినటువంటి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రతిపక్ష యూనియన్ ఐఎన్‌టీయూసీ, ఇతర సంఘాలు ఏం చేస్తున్నాయని కార్మిక కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. సంఘాలు వారి ప్రయోజనాలకు తప్ప కార్మికుల ప్రయోజనాలకు పని చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదేమైన సింగరేణిలో నిలిచిపోయిన మెడికల్‌బోర్డుపై తిరిగి ఎప్పడు నిర్ణయం తీసుకుంటారో అని అంతుచిక్కని ప్రశ్నలా ఉందన్నారు. అనారోగ్యం బారిన పడిన కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకోవడంతో పాటు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని మెడికల్ బోర్డు నిర్వహణకు యజామాన్యం చొరవ చూపాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే సామాజిక న్యాయం


నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి శంకర్

కాసిపేట, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఉద్యమంతోనే మాదిగ ఉప కులాలకు సామాజిక న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ కాసిపేట మండల ఇన్‌చార్జి జిలకర శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందక్రిష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి మాదిగ ఉప కులాలతో పాటు వికలాంగుల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఆయన పోరాటాల ఫలితంగానే నేడు ఎస్సీ వర్గీకరణ జరిగింది. ఎమ్మార్పీఎస్‌ను గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేసి మాదిగ హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేసేందుకు అందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. మండల కన్వీనర్‌గా గొడిశెల క్రాంతి, కో కన్వీనర్‌గా కాంపెల్లి వెంకటేశ్‌లకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు లంక లక్ష్మన్, దాసరి రాజన్న, గొడిశెల బాపు, గొడిశెల బాలయ్య, బుగ్గ రాజు, సురేందర్, అజయ్ కుమార్, కిషన్, మల్లేశ్, కళ్యాణ్, నరేశ్‌లు పాల్గొన్నారు.

18న పెళ్లి..అంతలోనే తిరిగిరాని లోకాలకు

● ఖానాపూర్ రోడ్డు ప్రమాదంలో

జన్నారం యువకుల దుర్మరణం ● స్వగ్రామాల్లో విషాదం

జన్నారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజులు గడిస్తే పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఆ యువకుడిని మృత్యువు కబళించింది. ఈనెల 18న ఆ యువకుడి పెళ్లి ఉండడంతో మేనల్లుడితో కలిసి పత్రికలు ఇచ్చేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదం రూపంలో తనువు చాలించారు. దీంతో పెళ్లి భాజాలు మోగాల్సిన ఆ ఇంట్లో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు ఇందనపల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్(25) ఈనెల 18న వివాహం ఉండడంతో తన అక్క కొడుకు అయినా మేనల్లుడు మురిమడుగు గ్రామానికి చెందిన పడిగేలా జశ్వంత్(19)తో కలిసి పెళ్లి పత్రికలు అందజేసేందుకు ఆదివారం వెళ్లారు. ఖానాపూర్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంవతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. లక్ష్మణ్ తండ్రి గంగన్న ఇరాక్‌లో ఉండగా తల్లి కమల రోదనను మిన్నంటాయి జస్వంత్ డిగ్రీ చదువుతున్నాడు. చేతికందవస్తున్న కొడుకు జస్వంత్ మృతితో తల్లిదండ్రులు రాజలింగం భాగ్యలక్ష్మి రోదనలు మిన్నంటాయి. రెండు గ్రామాలు విషాద ఛాయలు అలముకున్నాయి.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

కోటపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బొమ్మెన సంపత్ (30) అనే వ్యక్తి మద్యంమత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 11న రాత్రి తాగిన మైకంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి చెన్నూరు ఆసుపత్రికి, అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ రాజేందర్ పేర్కొన్నారు. మృతుడికి భార్య స్వప్న, సోదరుడు రాజేందర్ ఉన్నారు. సోదరుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లించాల్సి వస్తోందన్నారు. గతంలో ఉన్న స్కీంలు ఎత్తివేయకుండా అదనంగా కొత్త పథకాలకు చోటు కల్పిస్తున్నామని ఈ విషయం ప్రజలు గమనించాలని కోరారు.

● మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ తన ప్రాణం పోయేదాకా ప్రజల సంక్షమం కోసమే బతుకుతానని స్పష్టం చేసారు. 25ఏళ్ల తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు చూసానని, చివరి నిమిషం వరకు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు గడ్డు రోజులు ఉన్న సమయంలో ఇంద్రవెల్లి సభను విజయవంతం చేసి పార్టీకి పునర్జీవనం పోశానన్నారు. బట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రను కూడా విజయవంతం చేసానన్నారు, 320బస్సులతో భారత్ జోడో యాత్రలో పాల్గొన్నానని తెలిపారు. దండేపల్లి మండలంలో రూ.80కోట్లతో నాలుగు లిఫ్టులు మంజూరు చేయాలని డిప్యూటి సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. గూడెం ఆలయం వద్ద హరిత రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అందుకు హామీ ఇచ్చారు. ఈసమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కలెక్టర్ కుమార్‌దీపక్, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశీస్ సింగ్, జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. బహిరంగ సభలో నియోజకవర్గం నలు మూలల నుంచి దాదాపు లక్షకు పైగా మంది ప్రజలు పాల్గొన్నారు.

నియోజకర్గ ప్రజలు అదృష్టవంతులు

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క

లక్షెట్టిపేట: ఆసుపత్రి భవనం అద్భుతంగా ఉందని, నియోజకవర్గ ప్రజలు అదృష్ట వంతులని ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన 30పడకల ఆసుపత్రి భవనాన్ని ఆదివారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పట్టుబట్టి ఆస్పత్రి భవనాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. పైసా ఖర్చు లేకుండా కార్పొరేటుకు దీటుగా వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఈభవనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, వైద్య విధాన్‌పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి, డీసీహెచ్ డాక్టర్ కోటేశ్వర్, సూపరింటెండెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో సరోజ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. లక్షెట్టిపేటలో ఇటీవల నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల భవనాలను మంత్రులు, ఎమ్మెల్యే, అధికారులతో కలిసి పరిశీలించారు. లక్షెట్టిపేటలో నిర్మించిన భవనం లాంటి భవనాలు రాష్ట్రం మొత్తం ఏర్పాటు చేయడం కోసం పరిశీలించామని మంత్రులు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రులు ఎమ్మెల్యే, అధికారులు సహపంక్తి భోజనం చేసారు.

● లక్షెట్టిపేట ఆసుపత్రి భవన ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులకు లక్షెట్టిపేట మండల ఆశావర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేసారు.

● ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేసారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి అభినవ్, ఉన్నారు.


లక్షెట్టిపేట 30పడకల ఆసుపత్రి భవనం ప్రారంభిస్తున్న డిప్యూటి సీఎం, మంత్రులు


ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

ఇండస్ట్రియల్ పార్కుతో రెండు వేల మందికి ఉపాధి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హాజీపూర్: ఇండస్ట్రియల్ పార్కు ఐటీ హబ్‌తో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం హాజీపూర్ మండలంలోని వేంపల్లి, పోచంపాడు శివారులో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ హబ్, ఆటోనగర్‌లకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్‌లతో కలిసి భూమి పూజ చేసిన అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వేంపల్లి శివారులో మొదటి దఫా 212 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు, ఐటీ, ఆటోనగర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికిగాను 30 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇది పూర్తయితే 2వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో వేంపల్లి, పోచంపాడు శివారులో ఇండస్ట్రియల్ ఐటీ, ఆటోనగర్ ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. టీజీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ శశాంక్, అటవీశాఖచీఫ్ కన్జర్వే టర్ శాంతారాం, జిల్లా అటవీశాఖ అధి కారి ఆశీశ్‌సింగ్, ఐటీడీఏ పీవో ఖుష్బు మీనన్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని రెబ్బన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటి సీఎం బట్టి విక్రమార్కకు రెబ్బన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ కందుల కళ్యాణి అశోక్ దంపతులు నాగలి, గొంగళి, మేకపిల్లను బహూకరించారు.

● డిప్యూటి సీఎం సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు మోటపలుకుల గురువయ్యతో పాటు తన అనుచరులు సుమారు వంద మంది కాంగ్రెస్‌లో చేరారు.

● బహిరంగ సభ సందర్భంగా వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలను ఆద్యంతం అలరించేలా అమితంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృదం సభ్యులు ప్రదర్శించిన నృత్యాలు, తెలంగాణ గీతాలతో అలరించిన కళాకారులకు ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కోరగా అక్కడే ఉన్న మంత్రి జూపల్లి కృష్ణారావు వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రూ.2కోట్లతో జిల్లా కేంద్రంలో కళాభవన్ నిర్మించనున్నట్లు మంత్రి చెప్పారు.

● మంచిర్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం మంత్రుల పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి బాస్కర్ నేతృత్వంలో ఒక అడిషనల్ డీసీపీ, ఐదుగురు ఏసీపీలు, 25మంది సీఐలు, 60మంది ఎస్సైలు మరో ఆరువందల మంది సివిల్ పోలీసులతో పాటు స్పెషల్ పార్టీల సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు.

గోవిందారంలో ఉచిత మెగా వైద్య శిబిరం

భీమారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందారం గ్రామంలో భారతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రాచకొండ నాగరత్న, రాచకొండ శ్రీనివాస్‌లు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పుల్లూరి ఉమారాణి-దేవయ్య, బింగి స్వామి, ప్యాట వెంకటేశం, బాసోజి శోభన్, కుంట సురేష్, పీఎంపీ వైద్యులు తిరుపతి, అజీమ్, కాంతయ్య, రమేష్, సురేందర్, మల్లేశం, లక్ష్మీనారాయణ, బాలుసాని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పద్ధతి మార్చుకోవాలి

అటవీశాఖ అధికారుల పై ఎమ్మెల్యే ఆగ్రహం


అటవీశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి): చేస్తరా కోఆపరేషన్ చేయండి. చేయకపోతే నమస్కారం పెట్టి పంపించేస్తానంటూ అటవీశాఖ అధికారులపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నెన్నెల మండలానికి చెందిన పోడు రైతులను ఇబ్బంది పెట్టడం సరైందికాదని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలి కానీ రైతుల పంట ధ్వంసం ఎందుకు చేశారని ప్రశ్నించారు. చెన్నూర్ నియోజకవర్గంలోని తన తమ్మునికి ఒక రూల్ పెట్టి బెల్లంపల్లి నియోజకవర్గంలో తనకో రూల్ పెట్టడం ఏంటని అటవీశాఖ అధికారులను ప్రశ్నించారు. మీరైనకాని ఎవరైన కాని రైతులకు సమస్య సృష్టిస్తే ముఖ్యమంత్రి, మంత్రులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వెంటనే పద్ధతి మార్చుకోవాలని లేదంటే మీ అందరికి నమస్కారం పెట్టి పంపించేస్తానని హెచ్చరించిన మాటలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



చెల్లింపులు ఇలా...

ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి 1 నుంచి 5 తరగతుల వరకు 6.19 రూపాయలు, ఆరు నుంచి ఎనిమిది తరగతుల వరకు 9.29 రూపాయలు, 9, 10 తరగతుల విద్యార్థులకు 10.67 రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు వారానికి మూడు రోజుల చొప్పున గుడ్డు అందించేందుకు ఆరు రూపాయల చొప్పున చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వం భోజన బిల్లుతో పాటూ 1000 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 2000 రూపాయల చొప్పున గౌరవ వేతనం అందిస్తోంది.

అందని మధ్యాహ్న భోజన బిల్లులు

- అప్పు తెచ్చి నిర్వహణ
- మూడు నెలలుగా అందని డబ్బులు
- నిర్వాహకులకు తప్పని అప్పులు
- పట్టించుకోని అధికారులు

భీమిని, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపు, పోషకాహార లోపం నివారణ లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పేదవిద్యార్థులకు ఒక పూట పౌష్టికాహారాన్ని అందించి హాజరు శాతం పెంచేందుకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు భారంగా మారింది. ప్రస్తుతం ధరల పెరుగుదల కాలంలో ఒక నెల బిల్లులు తీసుకోకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయడం చాలా కష్టం... అలాంటిది మూడు నెలల పాటూ బిల్లులు తీసుకోకుండా విద్యార్థులకు భోజనం అందజేయడం అంటే చాలా కష్టంతో కూడుకున్న పనే. భీమినిలో మధ్యాహ్న భోజనం అందించే నిర్వాహకు లు అప్పులు తెచ్చి తమ సొంత ఖర్చులతో డబ్బులు వెచ్చించి విద్యార్థుల కడుపు నింపుతున్నారు.

మార్చి నెల నుంచి బిల్లులు అందజేయడం లేదు...

భీమిని మండలంలో 27 పాఠశాలల్లో 1,066 మంది విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు 40 మంది పనిచేస్తున్నారు. వీరికి గత విద్యా సంవత్సరం మార్చి నెల నుంచి ఈ ఏడు జూన్ నెల వరకు మధ్యాహ్న భోజన బిల్లులు అధికారులు అందజేయలేదు. చదువూ, ఉద్యోగం లేని తమకు ఉపాధి దొరుకుతందన్న నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయడానికి నిర్వాహకులుగా చేరి మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు కొందరు మహిళలు. కాని అధికారులు సకాలంలో భోజన బిల్లులు, గౌరవ వేతనాలు అందజేయక పోవడంతో, ఉపాధి సంగతి దేవుడెరుగు...అప్పుల పాలయ్యామని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభంలో ప్రతీ నెలనెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ప్రస్తుతం మూడు నెలలుగా బిల్లుల ఊసే తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ కొనాల్సిందే...

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ప్రభుత్వం స్థానిక స్వయం సహాయక సంఘాలకు బాధ్యతలు అప్పగించింది. విద్యార్థుల సంఖ్యను బట్టి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి నెలకు సరిపడా సన్న బియ్యం మాత్రమే పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. కూరగాయలు, పసుపు, కారం, చింతపండు, నూనె తదితర సరకులన్నీ సమకూర్చుకోవాల్సిందే. దీంతో చేసేది లేక తెలిసిన కిరాణం దుకాణాల్లో నుంచి ఉద్దెరలో సమకూర్చుకుని వంటలు చేస్తున్నారు.

పెరుగుతున్న ధరల ప్రభావం...

ఒక్కో విద్యార్థికి ఆరు రూపాయల చొప్పున కోడిగుడ్లకు చెల్లించడంతో వారికి వారానికి మూడు చొప్పున గుడ్లు అందించడం ఇబ్బందిగా మారింది. నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో నిర్వాహకులకు మెనూ ప్రకారం భోజనం అందించడం ఆర్థికభారంగా మారుతోంది. దీనికి తోడు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా బకాయిలను చెల్లించి, ప్రస్తుత ధరలకు అనుగుణంగా బిల్లులు సవరించాలని కోరుతున్నారు.



నెలనెలా బిల్లులు అందేలా చూడాలి..

దాసరి సరస్వతి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, వెంకటాపూర్



నెలనెలా మధ్యాహ్న భోజన బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలి. బిల్లులు సక్రమంగా అందితే అప్పులు తీసుకు రావల్సిన అవసరం ఉండదు. అప్పులతో సతమతమవుతున్నాం. అధికారులు ఇప్పటి కైనా ప్రతీనెలా బిల్లులు అందించాలి.భోజన నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలి.

నిర్వహణ కష్టమవుతోంది....

బోరె రాంబాయి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, భీమిని



మూడు నెలలుగా బిల్లులు అందకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహణ కష్టమవుతోంది. పాఠశాలలో విద్యార్థులకు ప్రతీ నెల కోడిగుడ్ల, నిత్యావసర సరకులకు చాలా ఖర్చు వస్తోంది. అప్పులు తెచ్చి వడ్డీలు తీర్చలేక భోజన నిర్వహణ భారంగా మారింది. ఇప్పటికైనా అధికారులు ప్రతీ నెలా బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలి.

మధ్యాహ్న భోజన వివరాలను ట్రెజరీకి పంపాం..: కృష్ణమూర్తి, మండల విద్యాధికారి, భీమిని



మధ్యాహ్న భోజన వివరాలను ట్రెజరీకి పూర్తి వివరాలను పంపాము. వారం రోజుల్లో అందరికీ బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటాము. బిల్లులు ఆలస్యం అయినా ప్రతీ ఒక్కరికీ పూర్తి స్థాయిలో బిల్లులు అందుతాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజనం నాణ్యతతో వండాలని సూచిస్తున్నాము.

ఘనంగా మైసమ్మతల్లి బోనాలు

● మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మందమర్రిటౌన్, జూలై13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వజోన్ డబుల్ బెడ్‌రూం కాలనీ వద్ద ఆదివారం మైసమ్మ తల్లి బోనాల జాతరలో ఘనంగా నిర్వహించారు. కాలనీలోని మహిళా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్లతో మైసమ్మతల్లి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. అమ్మవారికి ఇష్టమైన బెల్లం అన్నాన్ని నైవేద్యం పెట్టి తెల్లకల్లు ఆరగించారు. మేకలను బలిచ్చారు. కొత్తగా ఏర్పడిన కాలనీలో అందరు ఆయు రారోగ్యాలతో పాటు మంచి జరుగాలని ఆలయ చుట్టు ప్రదక్షిణలు చేశారు.

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా ఆషాఢమాస బోనాలను భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. అనంతరం బోనమెత్తి ఊరేగింపుగా బంగారు మైసమ్మ ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు నాయ కులు భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


బెల్లంపల్లిలో బోనమెత్తి ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే వినోద్

ఘనంగా క్వారీ దుర్గాదేవి జాతర

● తరలివచ్చిన వేలాది మంది ● ఉదయం నుంచే క్యూలైన్‌లో భక్తులు

హాజీపూర్, జూలై13(ఆంధ్రజ్యోతి): క్వారీ దుర్గాదేవి జాతర ఘనంగా ముగిసింది. 54వ వార్షికోత్సవ జాతరకు భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. హాజీపూర్ మండలం గడ్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంసీసీ క్వారీలో జాతరను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. జరిగే ఈ జాతర ఈ ఏడాది కూడ అంగరంగ వైభవంగా సాగింది. ఆదివారం ఉదయం దుర్గాదేవి ఆలయ ఆవరణలో చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వాహన పూజలు జరుపుకున్నారు. సామూహిక వన భోజనాలు నిర్వహించారు. దుర్గాదేవి దర్శన అనంతరం ఆలయ ఆవరణలోని పోచమ్మ నాగదేవతలను దర్శించుకున్నారు. జాతరకు మంచిర్యాల జిల్లాతో పాటు కరీంనగర్ జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథరావులు పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు పోలీసు సిబ్బంది దుర్గదేవిని దర్శించుకున్నారు.


దుర్గాదేవి ఆలయం ముందు బారులు తీరిన భక్తులు

మహిళా సాధికారతే లక్ష్యం


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

- నియోజకవర్గానికి ఒక మైక్రో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- అర్హత గల ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

మంచిర్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు వెలుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంచిర్యాల నియోజకర్గంలోని వివిధ మండలాల్లో రూ.100కోట్ల పైచిలుకు అభివృద్ధి పనులకు ఆదివారం ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేసారు. ఈసందర్భంగా దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో రూ.3కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయ నున్న ఇందిరా మహిళా శక్తి సోలార్ ప్లాంట్‌కు డిప్యూటి సీఎం, రాష్ట్ర వివిధశాఖల మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తోందన్నారు. వెల్గనూర్ జీపీ పరిధిలోని అందుగులపేట శివారులో సుమారు 4ఎకారాల విస్తీర్ణంలో రూ.3కోట్ల అంచనా వ్యయంతో ఒక మెగా వాట్ సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను నెల కొల్పుతామన్నారు. ప్లాంట్ ద్వారా ఐదువందల నుంచి 5వేల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగనుండగా రూ.51 లక్షల రాబడి వస్తుందన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కోరిక మేరకు పవర్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు కూడా ఆయన హామీ ఇచ్చారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ సూల్స్‌ద్వారా బడుగు బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను అందిస్తామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగు పర్చనున్నట్లు తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం మహిళా శక్తి క్యాంటిన్లను, పెట్రోల్ పంపుల ఏర్పాటు, పెరటికోళ్ల పెంపకం, పాలడైరీ, మహిళ శక్తి భవనాలు ఏర్పాటుతో పాటు రద్దీ ఉన్న ఖరీదైన ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసేందుకు స్థలాలు ఇస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసి పేదల సొంతింటి కలను సహకారం చేస్తామన్నారు. రైతుల సంక్షమంలో భాగంగా 70లక్షల రైతు కు టుంబాలకు రైతు భరోసాకింద కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు సాయం అందించామన్నారు. రూ.21వేలకోట్ల రుణమాఫీతో పాటు పంట నష్ట పరిహారం అందించామన్నారు. రాష్ట్రంలో 93లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తమకు ప్రత్యేకమని, ప్రతిపక్షంలో ఉన్నపుడు రేవంత్‌రెడ్డి బహిరంగసభకు, తన పాద యాత్రకు బీజం పడింది ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే అని గుర్తు చేసారు. ఆకృతజ్ఞతతో జిల్లాకు ప్రాణహిత -చేవేళ్ల ప్రాజెక్టునుతిరిగి బహుమతిగా ఇస్తామన్నారు.


దండేపల్లి మండలం రెబ్బన్‌పల్లిలో ఇందిరా మహిళా శక్తి సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్

●ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు మానివేసిందని, తమ ప్రభుత్వం మహిళలను అమితంగా ప్రోత్సహిస్తుందన్నారు. మం చిర్యాల కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో రూ.30 కోట్లతో 210 ఎకరాల్లో ఐటీ పార్కు నిర్మించడం చాలా గొప్ప విషయం అన్నారు. తద్వారా ఈప్రాంత నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయ న్నారు. మంచిర్యాల నియోజకర్గంలో ప్రైవేట్ స్కూల్స్‌తో పోటీ పడే విధంగా అత్యాదునిక వసతులతో ప్రభుత్వ పాఠ శాలలను నిర్మించడం ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావుకే సాధ్యపడిందని కొనియాడారు.

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అనుపత్రి డిజైన్ రాష్ట్రంలోనే ఒకరోల్ మాడల్‌గా నిలువనుం దన్నారు. ప్రభుత్వ సంక్షమాలను గుడ్డిగా అమలు చేస్తే ఏలాంటి ఫలితం ఉండదని, ప్రజల అభివృద్ధే ధ్యేయంగా వర్గాల ప్రాతిపదికన సంక్షమ పథకాలు అందజేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శించారు. రాష్ట్రంలో బీసీ జనాభా 56శాతం ఉండగా 42శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 35సం వత్సరాల బీసీల ఆకాంక్ష అయిన బీసీ కులగణణ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో అస్తవ్యస్త పరిపాలన సాగిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులకు ప్పగా మార్చారని ధ్వజమెత్తారు. ప్రతీ నెల కేసీఆర్ చేసిన...

మిగతా 7లో

ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం, అనాథశ్రమాల్లో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణ ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ రాజగోపాల్, లక్ష్మీనారాయణలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సభ్యులు వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, మహేందర్, ఆశ్రమం నిర్వహకులు సదానందం, తిరుమల, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

బెల్లంపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల 1974-75 పూర్వవిద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమపాఠశాల జ్ఞాపకాలను, ప్రస్తుత పరిస్థితులను ఒకరికొకరు అడిగి తెలుసుకున్నారు. 50ఏళ్ల తరువాత కలుసుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాప కాలను నెమరువేసుకున్నారు. ఉద్యోగవ్యాపార విరమణ తరువాత కుటుంబాలకే పరిమితం కాకుండా సామాజిక సేవలో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన


మార్కెట్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ రోడ్డు వెడల్పులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, జూలై13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కా ర్పొరేషన్ పరిధిలోని మార్కెట్ రోడ్డులో రూ.78 కోట్లతో సెంట్రల్ లైటింగ్ రోడ్డు వెడల్పు అండర్ డ్రైనేజీ అండర్ గ్రౌండ్ కేబుల్ నెట్ వర్కు వివిధ అభివృద్ధి పనులకు గాను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సమీపంలోని వ్యాపారస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం..

● మున్సిపాలిటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు


మందమర్రిలో మార్నింగ్‌వాక్‌లో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూలై13 (ఆంధ్రజ్యోతి): పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటిని రాష్ట్రంలోనే మెగా మున్సిపాలిటిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 23వ వార్డు బురద గూడెంలో మంత్రి మార్నింగ్‌వాక్ చేపట్టారు. వార్డులో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్తున్నానని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూడ నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటిలోనే 24 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు పనులు పూర్తి కావాల్సి వచ్చిందని తెలిపారు. తాను మున్సిపాలిటికి 8కోట్లకుపైగా నిధులు మంజూరు చేశామని తెలిపారు. మున్సిపాలిటిలో అమృతస్కీం పథకం కింద మందమర్రి, క్యాతన్‌పల్లి సంయుక్తంగా 30కోట్లతో తాగునీటి పైపులైన్‌లు పనులు సాగుతున్నాయని తెలిపారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా దాదాపు నియోజకవర్గంలో అన్ని గ్రామాలు పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికల రూపొందించి పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 200 కోట్లకు పైగా విద్యా, వైద్యానికి సంబంధించిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈసందర్భంగా 23వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ పనులు కావాలని ప్రజలు అడుగగా కమిషనర్ రాజలింగుతో పనుల ప్రతిపాదన పంపాలని నిధులు ఉంటే వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు దుర్గం ప్రభాకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


జిల్లా కేంద్రంలో బోనాలతో మహిళలు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లోని రాముని చెరువుకట్టపై ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలుఎత్తుకుని వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భీమారం : భీమారం మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో కొలువైన లక్ష్మీదేవి ఆలయంలో ఘనంగా పాండవుల బోనాల పండగను ముదిరాజ్‌లు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇంటింటి నుంచి బోనాలతో వచ్చి డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో కాలనీ అంతా మార్మోగింది. లక్ష్మీదేవి తమ ఇంటిల్లిపాది చల్లంగా చూడాలి తల్లి అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తిరునంగిరి ప్రవీణ్ లక్ష్మీదేవి పండగ గొప్పతనాన్ని ఇతి వృత్తాన్ని వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ల కుల సంఘం నాయకులు వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకుల మృతి
● దేవాపూర్‌లో విషాదం 6

అప్పు పుట్టదు.. పథకాలు అందవు 6
● ఏజెన్సీలో రైతుల దుస్థితి ● పట్టించుకోని పాలకులు

గూడెం గోదావరి నదికి వెళ్లేదెలా..

పుష్కర ఘాటు రహదారి శిథిలం.. పుణ్య స్నానానికి భక్తుల ఇక్కట్లు


కోతకు గురైన గూడెం గోదావరి వెళ్లే రోడ్డు

దండేపల్లి జూలై 13(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గోదావరికి వెళ్లేందుకు భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. పుష్కర ఘాటు రహదారి శిథిలం కావడంతో పుణ్యస్నానాలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీనెల సత్యనారాయణస్వామి దేవాలయంలో పౌర్ణమి జాతర జరుగుతుంది. ప్రతీరోజు స్వామి దర్శనం వందలాది మంది భక్తులు గూడెం గుట్టకు తరలివస్తుంటారు. ఇతర జిల్లాల నుంచి భక్తులు వచ్చి ఈ గోదావరి నదిలో పుణ్యస్నానా లు ఆచరించిన అనంతరం సత్యదేవుని దర్శనానికి వెళ్తుంటారు. కానీ గూడెం గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన పుష్కరా ఘాట్ల వద్ద కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారి మొత్తం శి థిలమై పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. భక్తులు నడవడానికి వీల్లేకుండా అటు వైపు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల సందర్భంగా గూడెం గోదావరినది పుష్కర ఘాట్లను అప్పటి ప్రభుత్వం నిర్మించింది. కానీ ఈ పుష్కర ఘాట్లు ఏడాదికి సుమారు 8నెలలు నీటిలో మునిగి ఉండటంతో పాటు ఎల్లంపల్లి జలా శయం బ్యాక్‌వాటర్‌తో ఘాట్లు, రహదారి నీట మునిగి ఉంటుంది. రెండేళ్ల క్రితం వచ్చిన వరద తాకిడికి గూడెం పుష్కర ఘాటు పరిసర ప్రాంతం మొత్తం చెడిపోయి అధ్వనంగా తయారై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పం దించి పుష్కర ఘాట్లు వెళ్లే రోడ్డును బాగు చేసి భక్తులు నడిచేందుకు దారిని ఏర్పాటు చేయాలని, పుష్కరఘాట్ల వద్ద భక్తులకోసం అన్ని వసతులు కల్పించే విధంగా చూడాలని భక్తులు కోరుకుంటున్నారు.


గూడెం గోదావరి పుష్కఘాట్ రహదారి వరద తాకిడికి కొట్టుకపోయిన ఫాంటు ఫామ్ రోడు

పచ్చని తెలంగాణే లక్ష్యంగా వన మహోత్సవం

● ఎమ్మెల్యే గడ్డం వినోద్


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వినోద్, అధికారులు, నాయకులు

బెల్లంపల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చెట్లు పెంచి ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం మండలంలోని లంబాడితండ గురుకుల పాఠశాలలో పాతబెల్లం పల్లి గ్రామంలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవ కా ర్యక్రమానికి హాజరై మొక్కలు నాటి మాట్లాడారు. వన మహోత్సవం కార్య క్రమం కింద పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. సరైన సమయంలో వర్షాలు పడాలన్న వాతావరణం సమతుల్యం ఉండాలన్న మొక్కలు కాపాడాలన్నారు ప్రభుత్వం ఇంటింటికీ మొక్కల పెంపకం కార్యక్రమం చేపడుతుందని మొక్కలు నాటడంతో పాటు కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అటవీశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి గోరింటాకు ప్రతిబింబం


గోరింటాకు వేడుకల్లో మహిళలు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతికి, ఐక్యతకు, ఆరోగ్యానికి ప్రతిబింబం గోరింటాకు పండగ అని ఫ్యామిలీ ఫ్రెండ్స్ ఫెడరేషన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు తోట వాణి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆషాడం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తి పాటలు పాడుతూ గోరింటాకును అరచేతులకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ పండగలు సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీక అన్నారు. భక్తి ప్రపత్తులతో ఏ పనిచేసినా శుభం కలుగుతుందని, ఆషాఢమాసంలో మహిళలకు గోరింటాకు, బోనాలు పండగ అత్యంత ఇష్టమైన వేడుకలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు రజిత, సుధ, రాణి, కార్తీక, భార్గవి, స్వప్న, నాగమణి, మౌనిక, ఎన్. స్వప్న, అనితరెడ్డి, సమత, మంజుల, సునీత, సితార, నిత్య, సుష్మ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు తీసుకువెళ్తున్న భక్తులు

భీమారం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని యాపల బొగుడ బోయవాడలో ఆదివారం మైసమ్మ విగ్రహాన్ని ఆలయంలో ఘనంగా ప్రతిష్ఠించారు. డప్పుసప్పుళ్ల మధ్య డీజే సౌండ్‌తో శివసత్తుల పూనకాలతో ఆవడం ఎక్స్‌రోడ్డు నుంచి ఆలయం వరకు చేరుకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పలు కాలనీల భక్తులు బోనాల చెంబులతో నీరు తీసుకువచ్చి అమ్మవారి పాదాలను కడుగుతూ నైవేద్యాలను సమర్పించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మ తల్లి జీవిత చరిత్రను పంబాల వంశ కులస్తులు కథ రూపంలో ప్రజలందరికి వివరించారు. సాయంత్రం ఆలయం వద్ద పట్నాలు వేశారు. ఆలయ కమిటీ నిర్వహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మల్లేష్, సారయ్య, కృష్ణ, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులతో దివాకర్‌రావు, విజిత్‌రావు

దండేపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు సమక్షంలో బీఆర్ ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎండీ. నజీర్, ఎండీ. నూస్రాత్‌ఖాన్, సీహెచ్.రాజలింగం, ఎస్‌కే.కరీం, కేఆర్.పో చయ్యలు జిల్లా కేంద్రంలోని దివాకర్‌రావు నివాసంలో బీఆర్ఎస్‌లో చేరగా ఆయన పార్టీ కండువాను కప్పి పార్టీలోకి సాదనంగా ఆహ్వానించారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

కావలెను
★ మంచిర్యాలలో హాస్పిటల్ నందు పని చేయుటకు ఆయాలు, నర్సులు, కంపౌండర్‌లు, ఎక్స్‌రే టెక్నీషియన్ కావలెను. ఆసక్తి కలవారు సంప్రదించగలరు. సెల్: 7036555577
AJK-238283

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నిర్మించబడిన /క్లెయిమ్స్‌కు, దాని వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏబీఎన్

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
మంచిర్యాల :- సెల్: 99854 11038
కాగజ్‌నగర్ :- సెల్ : 99854 08147